TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్
# వందే భారత్
Voice of Vande Bharath
తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 46 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ బుధవారం | మే 27, 2026



2లో..

## పదేళ్ల ‘కారు’ పాలన కంటే ఎక్కువే కట్టి చూపిస్తాం..

- చేతనైతే నా సవాల్ స్వీకరించు కేటీఆర్
- ఎమ్మెల్యేగా కూడా పోటీ చేయనని పొంగులేటి శపథం
- హైదరాబాద్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లే లక్ష్యం
- మహిళల పేరిట ఉచితంగా రిజిస్ట్రేషన్లు
- జూన్ 1న మరో 2.5 లక్షల ఇళ్లకు సీఎం రేవంత్ శ్రీకారం

## అకాల వర్షం.. అపార నష్టం



- కన్నీరు మున్నీరవుతున్న అన్నదాత
- పలు జిల్లాల్లో ఉరుములు, ఈదురుగాలులతో భారీ వర్షం
- కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో తడిసి ముద్దయిన ధాన్యం
- ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమంటూ రైతుల ఆందోళన..
- తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్

2లో..

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రాష్ట్ర ప్రజలకు అకాల వర్షం ఎండల నుంచి ఉపశమనం కలిగించినా, అన్నదాతలకు మాత్రం తీరని కన్నీరు మిగిల్చింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడినప్పటికీ.. ఐకేపీ కేంద్రాలు, కల్లాల్లో ఆరబోసిన ధాన్యం వరద నీటిలో తడిసిపోవడంతో రైతాంగం తీవ్ర ఆందోళనలో మునిగిపోయింది. పలుచోట్ల చెట్లు విరిగిపోయాయి రవాణాకు అంతరాయం ఏర్పడింది. సంగారెడ్డిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. కామారెడ్డి జిల్లాలో వర్షాలకు కల్లాల్లోని ధాన్యం కొట్టుకుపోయింది. సిద్దిపేట జిల్లా ముత్యాలో అత్యధికంగా 12.3 సెం.మీ. వర్షపాతం నమోదయింది. మహబూబానగర్ జిల్లా భూత్పూర్ మండలంలో 11 సెం.మీ., నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేటలో 8.4 సెం.మీ, నల్లగొండ జిల్లా గుండ్లపల్లిలో 6.2 సెం.మీ. వర్షం కురిసింది. సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. పిడుగులు పడే అవకాశం ఉండటంతో వాతావరణ శాఖ ప్రజలను అప్రమత్తం చేసింది.

## పినరయి విజయన్ నివాసాలపై ఈడీ దాడులు

- రాష్ట్రవ్యాప్తంగా 10 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు
- ఈడీ విచారణపై స్టే ఇచ్చేందుకు నిరాకరించిన కేరళ హైకోర్టు..
- మరుసటి రోజే రంగంలోకి అధికారులు

**తిరువనంతపురం,వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కేరళ రాజకీయాల్లో సంచలనం చోటుచేసుకుంది. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం సీనియర్ నేత పినరయి విజయన్ నివాసాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు బుధవారం తెల్లవారుజామున దాడులకు దిగారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ‘కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్’ అవినీతి, మనీలాండరింగ్ కేసులో భాగంగా ఈ సోదాలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. మాజీ సీఎం నివాసాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 కీలక ప్రాంతాల్లో ఈడీ అధికారులు ఏకకాలంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు.



2లో..

## పోలీస్ కస్టడీకి బండి భగీరథ్

‘సీన్ రీ-కన్‌స్ట్రక్షన్’ కోసం ఫామ్‌హౌస్‌కు తరలింపు



4లో..

## మోడీతో తమిళనాడు సీఎం విజయ్ భేటీ


- సీఎంగా బాధ్యతలు చేపట్టాక ఢిల్లీలో తొలి అధికారిక పర్యటన
- ‘సేవాతీర్థ్’లో 25 నిమిషాల పాటు చర్చలు
- మత్స్యకారుల విడుదలపై వినతి



3లో..

## రాష్ట్రానికి ‘ఆరెంజ్ అలర్ట్’

- ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి
- రైతులకు నష్టం జరగొద్దు..
- కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచండి
- బలమైన ఈదురుగాలుల హెచ్చరిక..
- అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించాలి



2లో..

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
బుధవారం, మే 27, 2026

# పినరయి విజయన్ నివాసాలపై ఈడీ దాడులు

- రాష్ట్రవ్యాప్తంగా 10 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు
- ఈడీ విచారణపై స్టే ఇచ్చేందుకు నిరాకరించిన కేరళ హైకోర్టు..
- మరుసటి రోజే రంగంలోకి అధికారులు



**(మొదటి పేజీ తర్వాత.. )** రూ.1.72 కోట్ల విలువైన ఈ మనీలాండరింగ్ కేసులో ఈడీ దర్యాప్తును తీవ్రతరం చేసింది. కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) అనే ప్రైవేట్ కంపెనీ నుంచి 2018-2019 మధ్యకాలంలో మాజీ సీఎం పినరయి విజయన్ కుమార్తె టి. వీణకు చెందిన 'ఎక్సాలాజిక్ సొల్యూషన్స్' ఐటీ కంపెనీకి ఎలాంటి సేవలు అందించకుండానే రూ.1.72 కోట్లు అక్రమంగా బదిలీ అయ్యాయనేది ప్రధాన ఆరోపణ. ఈ వ్యవహారంపై మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో ఈడీ జరుపుతున్న విచారణను రద్దు చేయాలని కోరుతూ సీఎంఆర్ఎల్ సంస్థ కేరళ హైకోర్టును ఆశ్రయించింది. అయితే, మంగళవారం ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం.. ఈడీ దర్యాప్తులో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేస్తూ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. కోర్టు నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన మరుసటి రోజే ఈడీ అధికారులు రంగంలోకి దిగడం గమనార్హం. బుధవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో భారీ బందోబస్తు, అత్యంత గోప్యత మధ్య ఈడీ బృందాలు రంగంలోకి దిగాయి. తిరువనంతపురంలోని పినరయి విజయన్ అద్దె నివాసం, కన్నూర్‌లోని ఆయన సొంత కుటుంబ నివాసంతో పాటు కోజికోడ్‌లోని మాజీ పర్యాటక శాఖ మంత్రి, విజయన్ అల్లుడు పి.ఎ. మహమ్మద్ రియాస్ నివాసాల్లో సోదాలు కొనసాగుతున్నాయి. ఈ దాడులకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# అకాల వర్షం.. అపార నష్టం

- కన్నీరు మున్నీరవుతున్న అన్నదాత
- పలు జిల్లాల్లో ఉరుములు, ఈదురుగాలులతో భారీ వర్షం
- కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో తడిసి ముద్దయిన ధాన్యం
- ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమంటూ రైతుల ఆందోళన..
- తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్



**(మొదటి పేజీ తరువాత ...)** ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ధాన్యం తడిసిపోయి నష్టపోతున్నామని రైతులు ఆరోపించారు. డిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెక్కలు ముక్కలు చేసుకొని, అప్పులు జేసి ఇంటిల్లిపాది ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తే.. అన్నదాతలకు చివరకు కన్నీళ్లే మిగిలాయి. ప్రభుత్వ నిర్లక్ష్యంతో కాంటా పెట్టాల్సిన వద్దు అకాల వర్షాలకు కండ్ల ముందే నీళ్లలో కొట్టుకుపోతుంటే రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. అష్టకష్టాలు పడి రైతులు కష్టాలను దిగమింగుకొని ధాన్యపు సిరులు



పండించారు. పుట్లకొద్ది పండిస్తే ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా, ధాన్యం కొనుగోలు చేయకపోవడం, అరకొరా కొన్నా కాంటాలు పెట్టకపోవడం, నెలల తరబడి గన్నీ సంచులు అందక, మద్దతు ధర లభించక, తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీ, తీరా కాంటాలు పెట్టాక లారీల కొరతతో లోడింగ్ చేయకపోవడంతో కల్లాల్లోనే ధాన్యం పంటలు తడిసి ముద్దయ్యింది. సకాలంలో కొనుగోలు చేసి ఉంటే తమకు నష్టం జరిగేది కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు. మెదక్ జిల్లాలో ఈదురు గాలులు బీభత్సం సృష్టించింది. మంగళవారం రాత్రి నుంచి ఈదురు గాలులతో భారీ వర్షం పడడంతో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యం వర్షానికి తడిసిపోయింది. ఈదురు గాలులు భారీగా వీచడంతో చెట్లు కరెంటు స్తంభాలు కూలిపోయాయి. మెదక్ జిల్లాలోని మెదక్, హవేలీ ఘనాపూర్, పాపన్నపేట, కుల్చారం, కౌడిపల్లి, చిలిపిచెడ్, చిన్న శంకరంపేట్, రామాయంపేట, చేగుంట తో పాటు పలు మండలాల్లో కల్లాల్లోని ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో దాన్యం బస్తాలు తడిచిపోవడంతో రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొని ఉంటే తమకు నష్టం జరిగేది కాదని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. కొన్నిచోట్ల వడ్ల కుప్పలు ఉండగా మరికొన్ని చోట్ల వరి ధాన్యం బస్తాలో నింపించారు. కాంటజేసిన లారీలు సకాలంలో రాకపోవడంతో ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రాలలో నిలువ చేశారు. అకాల వర్షానికి వరి ధాన్యం తడిచిపోవడంతో తమకు తీవ్ర నష్టం జరిగిందని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు.



# పదేళ్ల 'కారు' పాలన కంటే ఎక్కువే కట్టి చూపిస్తాం..

- చేతనైతే నా సవాల్ స్వీకరించు
- ఎమ్మెల్యేగా కూడా పోటీ చేయనని పొంగులేటి శపథం
- హైదరాబాద్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లే లక్ష్యం
- మహిళల పేరిట ఉచితంగా రిజిస్ట్రేషన్లు
- జూన్ 1న మరో 2.5 లక్షల ఇళ్లకు సీఎం రేవంత్ శ్రీకారం

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రవ్యాప్తంగా త్వరలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా 'ఇందిరమ్మ ఇండ్ల' పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలంగాణ గృహనిర్మాణ, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. బుధవారం సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌లతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే దాదాపు ఒక లక్ష ఇండ్ల నిర్మాణం పూర్తయిందని, జూన్ చివరి నాటికి మరో లక్ష ఇండ్లను పూర్తి చేస్తామని మంత్రి ప్రకటించారు. తొలిదశలో హైదరాబాద్ పరిధిలో లక్ష ఇండ్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందుకోసం 13 ప్రాంతాల్లో స్థలాలను కూడా పరిశీలించామని మంత్రి తెలిపారు. అయితే జీహెచ్ఎంసీ పరిధిలో స్థలాల కొరత కారణంగా ప్రస్తుతం 18 వేల ఇండ్లను మంజూరు చేశామని వివరించారు. పేదల కోసం విలువైన ప్రభుత్వ భూములను కేటాయిస్తున్నామని, జీవనోపాధికి అనుకూలంగా ఉండే నివాస యోగ్యమైన ప్రాంతాల్లోనే వీటిని నిర్మిస్తామన్నారు. ఒక్క రూపాయి ఫీజు కూడా లేకుండా మహిళల పేరిట ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి, సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. జూన్ 1న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లైనా కట్టినట్లు నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విసిరిన సవాల్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఘాటుగా స్పందించారు. కేటీఆర్‌కు ఓపెన్ ఛాలెంజ్ విసురుతూ బుధవారం హైదరాబాద్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు. "గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన ఇండ్ల కంటే మా కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ ఇండ్లు కట్టి చూపిస్తుంది. ఒకవేళ మేము అంతకంటే ఎక్కువ ఇండ్లు



కట్టలేకపోతే వచ్చే ఎన్నికల్లో నేను పోటీ చేయను, అసలు ఎమ్మెల్యేగా కూడా నిలబడను. మరి మేము ఎక్కువ ఇండ్లు నిర్మిస్తే.. మీరు ఎన్నికల పోటీకి దూరంగా ఉంటారా?" అని కేటీఆర్‌కు పొంగులేటి ఎదురు సవాల్ విసిరారు. మే 23న సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలోనే హైదరాబాద్‌లోని మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని నిర్ణయించామని మంత్రి గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర ఏళ్లలోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇండ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. "ఇందిరమ్మ పాలన అంటే ఏమిటో తెలుసుకోవాలంటే ఫామ్‌హౌస్‌ల నుంచి బయటకు వచ్చి, గ్రామాల్లో ఇండ్లు కట్టుకున్న పేద కుటుంబాలను అడిగితే తెలుస్తుంది. అంతేకానీ ఫామ్‌హౌస్‌లలో కూర్చుంటే ప్రజా సమస్యలు ఏం తెలుస్తాయి?" అంటూ కేటీఆర్‌కు చురకలంటించారు.

# రాష్ట్రానికి 'ఆరెంజ్ అలర్ట్'

- అధికారులను అప్రమత్తం చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి
- రైతులకు నష్టం జరగొద్దు..
- కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచండి
- బలమైన ఈదురుగాలుల హెచ్చరిక..
- అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించాలి

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలో రానున్న రోజుల్లో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ పలు జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. వాతావరణ మార్పులపై నిరంతరం అలర్ట్‌గా ఉండాలని, ఎక్కడా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అకాల వర్షాల వల్ల అన్నదాతలు నష్టపోకుండా ఉండేందుకు కింది సూచనలు చేశారు. ఐకేపీ, ఇతర ప్రభుత్వ కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలి. కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచిన ధాన్యం వర్షానికి తడవకుండా అవసరమైనన్ని టార్పాలిన్లను వెంటనే అందుబాటులో ఉంచాలి. ఇప్పటికే కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల నుంచి అదనపు టార్పాలిన్లను సేకరించి, అవసరమున్న ఇతర ప్రాంతాలకు తక్షణమే తరలించాలి.వాతావరణ కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో అత్యవసర పరిస్థితులు తలెత్తితే అధికారులు క్షణాల మీద స్పందించేలా క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ముఖ్యంగా బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉన్నందున విద్యుత్, రవాణా శాఖలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు కూడా వాతావరణ పరిస్థితులను గమనిస్తూ, అవసరమైతే తప్ప ఇండ్ల నుంచి బయటకు రాకూడదని మరియు తగిన జాగ్రత్తలు పాటించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
బుధవారం, మే 27, 2026

# దాతల సహకారంతో ప్రభుత్వ స్కూల్లో భోజనశాల

- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ
- పేద విద్యార్థుల కోసం ఎంఎస్ఆర్ ప్రాజెక్ట్స్ ఉదారత
- దాతల సేవలను అభినందించిన ప్రజాప్రతినిధులు



**ఉప్పునుంతల, వాయిస్ ఆఫ్ వందే భారత్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం దాతల ఉదార సహాయంతో నిర్మించ తలపెట్టిన ఆధునిక భోజనశాల భవన నిర్మాణానికి బుధవారం ఘనంగా భూమి పూజ జరిగింది. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థుల ఇబ్బందులను గమనించి, అదే గ్రామానికి చెందిన ప్రముఖ సంస్థ 'ఎంఎస్ఆర్ ప్రాజెక్ట్స్ అండ్ మినరల్స్ ప్రైవేట్ లిమిటెడ్' నిర్వాహకులు మడ్డి సుభాష్ రెడ్డి, మడ్డి నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డిలు రూ.30 లక్షల భారీ విరాళాన్ని ప్రకటించారు. ఈ నిధులతో నిర్మించనున్న భోజనశాల భవనానికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, డీసీసీ అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసి శాస్త్రోక్తంగా భూమి పూజ చేసి, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ.. తాము పుట్టి పెరిగిన ఊరిపై మమకారంతో, ప్రభుత్వ స్కూలులోని పేద విద్యార్థులకు అండగా నిలవాలనే సంకల్పంతో రూ.30 లక్షల విరాళం అందించి భోజనశాల నిర్మిస్తున్న ఎంఎస్ఆర్ ప్రాజెక్ట్స్ యాజమాన్యాన్ని అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థుల అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు ఇలాంటి దాతలు ముందుకు రావడం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ఈ భోజనశాల నిర్మాణం పూర్తయితే విద్యార్థులు వర్షం, ఎండ అనే తేడా లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో మధ్యాహ్న భోజనం చేయడానికి వీలవుతుందని పేర్కొన్నారు. ఈ ప్రతిష్టాత్మక శంకుస్థాపన కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు కట్ట అనంత రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, సింగిల్ విండో సీఈవో కొత్త రవీందర్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జే.శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. వీరితో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు చింతగల శ్రీనివాసులు, రతన్ సింగ్, బీసీ సెల్ మండల అధ్యక్షులు తిరుపతి గౌడ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు మేడముని భాస్కర్, మండల యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జ్ అంతటి శేఖర్ గౌడ్, సింగల్ విండో డైరెక్టర్ శ్రీనివాసులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# మాదిగల్లో అక్షరాస్యత పెంపునకు 40 రోజుల "గో టు విలేజ్"

**ఎమ్మార్పీఎస్ నాయకుల పిలుపు**



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మాదిగ సామాజిక వర్గంలో పాఠశాల డ్రాప్‌అవుట్స్‌ను తగ్గించి, ఉన్నత విద్యా అవకాశాలను అందిపుచ్చుకునేలా అక్షరాస్యతను పెంపొందించేందుకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నేటి నుండి జులై 5 వరకు 40 రోజుల పాటు "గో టు విలేజ్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జిలు ఆడేపు నాగార్జున మాదిగ, మద్దిలేటి మాదిగ తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల విస్తృత స్థాయి సమావేశం జిల్లా ఉపాధ్యక్షుడు ఎడెల్లి ఆంజనేయులు మాదిగ అధ్యక్షతన బుధవారం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గుడియానిపల్లె రాజు మాదిగతో పాటు ఇంచార్జిలు ఆడేపు నాగార్జున, మద్దిలేటి మాదిగలు మాట్లాడుతూ మాదిగలకు విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించి, అక్షరాస్యతను శాతాన్ని పెంచేందుకు ప్రతి గ్రామంలో చైతన్య సమావేశాలు నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారని, అందులో భాగంగానే ఈ 'గో టు విలేజ్' కార్యక్రమాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టామని వివరించారు. "మాదిగ జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఎమ్మార్పీఎస్ ఉద్యమం అత్యంత ప్రతిష్టాత్మకమైన 32వ వసంతంలోకి అడుగుపెడుతోంది. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలోనూ ఎమ్మార్పీఎస్ జెండా గద్దెలను నిర్మించి, జులై 7న నిర్వహించే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని 'మాదిగ జాతి పండుగ'గా ప్రతి ఇంటా ఘనంగా జరుపుకోవాలన్నారు. ఎమ్మార్పీఎస్ , మహాజన సోషలిస్ట్ పార్టీ, వాటి అనుబంధ సంఘాల నాయకులు, నియోజకవర్గ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మోడీతో తమిళనాడు సీఎం విజయ్ భేటీ

- సీఎంగా బాధ్యతలు చేపట్టాక ఢిల్లీలో తొలి అధికారిక పర్యటన
- 'సేవాతీర్థ్'లో 25 నిమిషాల పాటు చర్చలు
- మత్స్యకారుల విడుదలపై వినతి

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తమిళనాడు నూతన ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ దేశ రాజధాని ఢిల్లీలో తన తొలి అధికారిక పర్యటనను ప్రారంభించారు. ఇందులో భాగంగా బుధవారం ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోదీని 'సేవాతీర్థ్'లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన తర్వాత విజయ్.. ప్రధాని మోదీతో సమావేశమవడం ఇదే మొదటిసారి. దాదాపు 25 నిమిషాల పాటు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న ఈ భేటీలో తమిళనాడు రాష్ట్ర అభివృద్ధి, కేంద్రం నుంచి అందాల్సిన ఆర్థిక సాయంతో పాటు పలు కీలక ద్వైపాక్షిక అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలను ప్రధానమంత్రి కార్యాలయం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పంచుకుంది. ప్రధాని మోదీతో ముఖ్యమంత్రి విజయ్ జరిపిన చర్చల వివరాలను వెల్లడిస్తూ తమిళనాడు ప్రభుత్వం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఇటీవల నెదర్లాండ్స్ పర్యటన సందర్భంగా చారిత్రాత్మక 'అనైమంగళం' రాగి శాసనాలను తిరిగి భారతదేశానికి రప్పించడంలో ప్రధాని మోదీ చూపిన చొరవకు సీఎం విజయ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమిళనాడు మత్స్యకారులను శ్రీలంక నౌకాదళం నిరంతరం అరెస్టు చేయడం, వేధించడంపై సీఎం విజయ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాదిలోనే 12 అరెస్టులు నమోదయ్యాయని, ప్రస్తుతం 58 మంది మత్స్యకారులు, వారి పడవలు శ్రీలంక నిర్బంధంలో ఉన్నాయని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని వారిని తక్షణమే విడిపించేలా శ్రీలంకపై ఒత్తిడి తేవాలని కోరారు. సీఎం విజయ్ తన ఢిల్లీ పర్యటనలో భాగంగా ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌లను కలవనున్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులపై ఆర్థిక మంత్రితో ప్రత్యేకంగా చర్చించనున్నారు. మరోవైపు, ఎన్నికల అనంతరం తమిళనాడు ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలను 10 జన్‌పథ్‌లో విజయ్ కలుసుకోనున్నారు. ఈ నేపథ్యంలో జన్‌పథ్ వెలుపల భారీగా 'రాహుల్-విజయ్' పోస్టర్లు వెలిశాయి. వీటితో పాటు వామపక్షాలు, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నేతలు కూడా తమిళనాడు హౌస్‌లో సీఎంతో సమావేశం కానున్నారు.



# సమర్థవంతమైన సేవలు అందించాలి

- ఎస్పీ మహేష్ బి. గితే
- వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ తనిఖీ
- రాత్రి వేళల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలి
- గంజాయి, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం
- కేసుల దర్యాప్తు, రికార్డుల నిర్వహణపై సమీక్ష



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, సమర్థవంతమైన సేవలు అందించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పోలీస్ స్టేషన్ల పనితీరును మరింత మెరుగుపరిచే దిశగా బుధవారం ఆయన వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరుతో పాటు రౌడీషీటర్లు, పాత నేరస్తులపై ఉంచిన నిఘా అంశాలను ఎస్పీ క్షుణ్ణంగా సమీక్షించారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల విషయంలో ఎలాంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అధికారులు, సిబ్బంది అందరూ సమన్వయంతో విధులు సక్రమంగా నిర్వహించినప్పుడే శాంతిభద్రతలు పూర్తి అదుపులో ఉంటాయన్నారు. సిబ్బందికి కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన, సమాచారం కలిగి ఉండాలని, క్షేత్రస్థాయిలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నా ఉన్నతాధికారులకు తక్షణమే నివేదించాలని సూచించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేయాలని ఎస్పీ ఆదేశించారు. అర్ధరాత్రి దొంగతనాలు జరగకుండా చూసుకోవడంతో పాటు, గంజాయి అక్రమ రవాణా, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై కఠిన నిఘా కొనసాగించాలన్నారు. ముఖ్యంగా ప్రస్తుత రోజుల్లో యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని, అందుకోసం కళాశాలలు, గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో ఎస్పీ వెంట వేములవాడ పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్, సబ్ ఇన్‌స్పెక్టర్లు ప్రేమనందం, శ్రీనివాస్, ఎల్లగౌడ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ వందే భారత్ Voice of Vande Bharath

VOICE OF VANDE BHARATH

బుధవారం, మే 27, 2026

## గంజాయి, డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యం

### పదరలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు



**పదర, వాయిస్ ఆఫ్ వందే భారత్:** యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మాదకద్రవ్యాలు, గంజాయి రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు ముమ్మరమయ్యాయి. ఇందులో భాగంగా బుధవారం నాడు పదర మండల కేంద్రంలో స్థానిక పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని పలు వ్యాపార సముదాయాలు, కిరాణా దుకాణాలు, పాన్ షాపులు మరియు అనుమానాస్పద ప్రాంతాలను పోలీసులు క్షుణ్ణంగా శోధించారు. ఈ ఆకస్మిక దాడుల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది బెల్జియం స్నిఫర్ డాగ్ మాదకద్రవ్యాలను పసిగట్టడంలో అత్యంత నైపుణ్యం కలిగిన ఈ శిక్షణ పొందిన డాగ్ సహాయంతో దుకాణాల మూలమూలలను, అనుమానాస్పద బ్యాగులను సిబ్బంది తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదర సబ్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ.. మండల పరిధిలో ఎవరైనా చట్టవిరుద్ధంగా గంజాయి, డ్రగ్స్ లేదా నిషేధిత గుట్కా వంటి పదార్థాలను విక్రయిస్తే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా యువత ఇటువంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా గంజాయి సాగు లేదా విక్రయాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను అత్యంత రహస్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఈ ప్రత్యేక తనిఖీ కార్యక్రమంలో ఎస్సై వినోద్ కుమార్‌తో పాటు పోలీస్ కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్య సేవల్లో నిర్లక్ష్యం సహించం

- జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్
- ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలపై కలెక్టర్ ఆరా
- పీహెచ్‌సీల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి




**బల్మూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నాగర్ కర్నూలు జిల్లా బల్మూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ బుధవారం ఉదయం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, అందుబాటులో ఉన్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఏఎన్ఎం కిట్‌ను కలెక్టర్ ప్రత్యేకంగా పరిశీలించారు. కిట్‌లో ఉన్న వైద్య పరికరాలు, మందులు, అత్యవసర సేవలకు ఉపయోగించే సామగ్రి గురించి సంబంధిత వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఏఎన్ఎం కిట్లలో పాము కాటు, కుక్క వ్యాక్సిన్ లు, పిల్లలకు అందించే వ్యాక్సిన్లు ఉన్నాయా లేదా అని కలెక్టర్ ఆరా తీశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అన్ని పరికరాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. అనంతరం ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది సమయానికి అందుబాటులో ఉంటున్నారా, మందులు సరిపడా ఉన్నాయా, రోగులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా అనే అంశాలపై ఆరా తీశారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని వైద్య అధికారులను హెచ్చరించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని, ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని సూచించారు. గర్భిణీలు, చిన్నారులకు అందించే వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని, గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు సకాలంలో అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీ సందర్భంగా కలెక్టర్ వెంట అచ్చంపేట ఆర్డీవో యాదగిరి, తహసీల్దార్ శ్రీనివాస్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, స్థానిక వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులు పారదర్శకంగా నిర్వహించాలి

- నాణ్యతతో పనులు పూర్తి చేయాలి
- ఉపాధి పనులను పరిశీలించిన కలెక్టర్ పాటిల్

**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** నియోజకవర్గం పరిధిలోని బల్మూర్ మండలంలోని కొండనాగుల గ్రామం లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న రోడ్డు చదును పనులను హేమంత్ కేశవ్ పాటిల్ ఆకస్మికంగా పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు గ్రామీణ పేదలకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి పనుల పురోగతిని ఆయన నేరుగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కొండనాగుల గ్రామం లో పనులు జరుగుతున్న ప్రాంతానికి చేరుకున్న కలెక్టర్ అక్కడ పనిచేస్తున్న కూలీలతో ఆప్యాయంగా మాట్లాడారు. రోజువారీ హాజరు నమోదు, కూలి చెల్లింపులు సమయానికి అందుతున్నాయా లేదా అనే అంశాలపై ఆరా తీశారు. కూలీలకు తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స వంటి ప్రాథమిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మహిళా కూలీలతో ప్రత్యేకంగా మాట్లాడి పనిస్థలాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...... ఉపాధి హామీ పథకం గ్రామీణ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే ముఖ్యమైన పథకమని తెలిపారు. గ్రామాల్లో చేపడుతున్న రోడ్డు చదును, చెరువుల అభివృద్ధి, వాననీటి సంరక్షణ వంటి పనులు గ్రామీణాభివృద్ధికి దోహదపడతాయని అన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ప్రతి పనిని పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను సూచించారు. రోడ్డు పనుల నాణ్యతను పరిశీలించిన కలెక్టర్, పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. గ్రామస్తులు కూడా పనులపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, గ్రామ రహదారుల అభివృద్ధితో రాకపోకలకు ఎంతో సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట అచ్చంపేట ఆర్డీఓ యాదగిరి తాహసిల్దార్ శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ



**అచ్చంపేట.: వాయిస్ ఆఫ్ వందే భారత్:** పట్టణంలోని 13వ వార్డు వలపట్ల కాలనీకి చెందిన మున్సిపల్ వాటర్ మ్యాన్ ఉల్వర ధర్మేందర్ కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో చనిపోవడం జరిగింది. టీపీసీసీ ఉపాధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ విషయం తెలుసుకొని వారి స్వగృహానికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, కమిషనర్ మురళి, మార్కెట్ కమిటీ అంతటి రజిత మల్లేష్, అంతటి చంద్రయ్య, చింటూ, వరప్రసాద్, సుగుణ రావు, మునీందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## పోలీస్ కస్టడీకి బండి భగీరథ్

### 'సీన్ రీ-కన్‌స్ట్రక్షన్' కోసం ఫామ్‌హౌస్‌కు తరలింపు

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్‌ను బుధవారం పేట్ బషీరాబాద్ పోలీసులు అధికారికంగా కస్టడీలోకి తీసుకున్నారు. కోర్టు అనుమతితో చంచల్‌గూడ జైలు నుంచి భగీరథ్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్న పోలీసులు.. తదుపరి దర్యాప్తులో భాగంగా అతడిని నేరుగా రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని 'అరణ్య ఫామ్‌హౌస్'కు తరలించారు. ఘటన జరిగినట్లుగా భావిస్తున్న సదరు ఫామ్‌హౌస్‌లో సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ ప్రక్రియను పోలీసులు చేపట్టినట్లు తెలుస్తోంది. అయితే కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేయడానికి, నిందితుడి నుంచి కీలక ఆధారాలు సేకరించడానికి వారం రోజుల పాటు పోలీస్ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు మేడ్చల్ మల్కాజ్‌గిరి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం.. నిందితుడిని మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వుల అనంతరం చంచల్‌గూడ జైలు నుండి భగీరథ్‌ను పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించిన ఉన్నతాధికారులు విచారణను వేగవంతం చేశారు. ఘటనకు సంబంధించిన సాంకేతిక, శాస్త్రీయ ఆధారాలను సేకరించేందుకు మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో విచారణ జరుపుతున్నారు.

# ఐకేపీ, వీఓఏల సమ్మెకు బీఆర్ఎస్ సంఘీభావం



**వేములవాడ,వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం వేములవాడ నియోజకవర్గ కేంద్రంలో గత తొమ్మిది రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న వేములవాడ అర్బన్, రూరల్ మండలాల ఐకేపీ, వీఓఏల సమ్మె శిబిరాన్ని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులకు ఆయన బీఆర్ఎస్ పార్టీ తరఫున పూర్తి సంఘీభావం ప్రకటించారు. సమ్మె ఉద్దేశ్యాన్ని అడిగి తెలుసుకున్న అనంతరం ఏనుగు మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. రాత్రింబవళ్లు గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధి కోసం శ్రమిస్తున్న వీఓఏల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలన్నారు. వారి కింది డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్మికులు తొమ్మిది రోజులుగా రోడ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్నా ప్రభుత్వ పెద్దలకు చలనం లేకపోవడం దారుణమన్నారు. వీఓఏల సమస్యలు పరిష్కారమయ్యే వరకు బీఆర్ఎస్ పార్టీ వారికి అండగా నిలబడి పోరాడుతుందని మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సంఘీభావ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గోస్కుల రవి, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షులు ఏశ తిరుపతి, సర్పంచులు ఊరడి సునీత-రాజిరెడ్డి, ముత్త సంజన-మహేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డం హన్మాండ్లు, మాజీ సర్పంచ్ సుమన్, దేవరాజు, గోపు మధు, అనిల్, ఐకేపీ, వీఓఏ ప్రతినిధులు పాల్గొన్నారు.